సాక్షి ఆదిలాబాద్

శనివారం । 16 । మార్చి । 2024



యథేచ్ఛగా తోడేస్తున్నారు..
ఆదిలాబాద్ డివిజన్‌లో యథేచ్ఛగా మొరం అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. 9లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:27	ఆది: 5:01

గరిష్టం/కనిష్టం
37.0 /25.0

వాతావరణం
వాతావరణం పలుచోట్ల మేఘావృతమై నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 1నుంచి ప్రారంభమవుతుందని, 30 రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫీజు రూ.15,600 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కే యూనస్ ఫోను 7382840349 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రిమ్స్ కార్మికుల సమ్మె విరమణ



హామీ పత్రం అందజేస్తున్న ఏజెన్సీ బాధ్యులు

ఎదులాపురం: జీవో ప్రకారం వేతనాల చెల్లింపుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కార్మికులు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్–ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం కూడా వారు సమ్మె కొనసాగించగా కృష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ బాధ్యులు వేణు శిబిరం వద్దకు చేరుకొని కార్మికులతో చర్చించారు. ఏజెన్సీ ఎం.డీ హేమంత్‌రెడ్డి సమక్షంలో ఏప్రిల్ ఒకటో తేదీన సమ్మె డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. ఇందులో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, యూనియన్ నాయకులు ముజీబ్, ఖాసీం, సంగీత, లస్మక్క, కమల మ్మ, గంగామణి, రవి, రాజేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా ఆనంద్‌రావు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావు నియమాకమయ్యారు. ఈ మేరకు ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్రచైర్మన్ బెల్లయ్యనాయక్ ఉత్తర్వులు జారీచేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివాసీ విభాగం తరఫున ఆయన సేవలందించనున్నట్లు పేర్కొన్నారు.

గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఎదులాపురం: పదో తరగతి పరీక్షలు ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డీఈవో ప్రణీత పలు సూచనలు చేశారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఓఎంఆర్ షీట్‌లో పేరు సరిగా ఉందో లేదో చూసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్డీవోగా వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా వినోద్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఆర్డీవో తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్లు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

'భార్గవ్'పై సస్పెన్షన్ కొనసాగింపు



జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

కైలాస్‌నగర్: డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండేపై కాంగ్రెస్‌అధిష్టానం ఇదివరకు విధించిన ఆరేళ్ల సస్పెన్షన్‌ను యథావిధిగా కొనసాగించాలని పీసీసీ క్రమశిక్షణ శిక్షణ సంఘం నిర్ణయించింది. ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించింది. ఈ మేరకు క్రమశిక్షణా సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి తాజా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయనకు ఫోన్ ద్వారా కూడా సమాచారమందించినట్లుగా పేర్కొన్నారు. భార్గవ్ దేశ్‌పాండేతో పాటు మరో ముగ్గురు అసమ్మతి నాయకులు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, అల్లూరి సంజీవ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ ఆరేళ్లపాటు యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సర్కారు బడుల్లో.. అమ్మ ఆదర్శ



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

- ఎస్ఎంసీల స్థానంలో ఏర్పాటు
- 'ఎస్‌హెచ్‌జీ సభ్యులతో కొత్త కమిటీలు
- వీటికే పాఠశాల నిర్వహణ బాధ్యతలు
- జూన్ 10నాటికి మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో మౌలిక వసతులు, పర్యవేక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఇదివరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు పాఠశాల నిర్వహణ బాధ్యతలు చూసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం వాటి కాలం ముగిసినప్పటికీ పదవి కాలం పొడిగిస్తూ వచ్చింది. తాజాగా ప్రభుత్వం ఆ కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో..

జిల్లాలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంది. 4 పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిని మినహాయించి 453 ప్రాథమిక, 102 ప్రాథమికోన్నత, 109 ఉన్నత పాఠశాలల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా పాఠశాలల్లో మొత్తం 51,332 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

మన ఊరు– మనబడి పనులు అక్కడికక్కడే..

గత ప్రభుత్వం 2021 మార్చిలో మన ఊరు– మన బడి పేరిట కార్యక్రమాన్ని షురూ చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మొదటి విడత 237 పాఠశాలల్లో పనులను ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు కేవలం 18 పాఠశాలలను మాత్రమే పునఃప్రారంభించారు. ఇంకా 16 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి నిర్మాణం, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ.100 కోట్ల నిధులు కేటాయించగా, ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు రూ.25 కోట్ల 94లక్షలు మాత్రమే విడుదల చేసింది. గతేడాది జూలై నుంచి పనులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అయితే కొత్తగా చేపట్టే అమ్మ ఆదర్శ కమిటీలు ఈ పనులను కొనసాగిస్తాయా.. లేదా అనేది చూడాల్సిందే. కాగా, జూన్ 10 నాటికి సర్కారు బడల్లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి అవసరమైన నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు సూచించింది.

కమిటీల బాధ్యతలు..

ఈ కమిటీలు సర్కారు బడుల్లో మౌలిక వసతుల బలోపేతానికి కృషి చేయనున్నాయి. బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడం, ఇతర మరమ్మతు పనులు, సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో పా టు విద్యార్థులకు అందజేసే యూనిఫాం కుట్టించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలు తీసుకుంటాయి. అమ్మ ఆదర్శ కమిటీలో పాఠశాల స్థాయిలో ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు చైర్‌పర్సన్, మిగతావారు సభ్యులుగా ఉంటారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇకపై ప్రభుత్వ బడి నిర్వహణ బాధ్యతలు స్వయం సహాయక సంఘాలే చూస్తాయి.

పాఠశాలల వివరాలు..

జిల్లాలో మొత్తం పాఠశాలలు: 678
ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయనున్నవి: 664
జిల్లాలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు: 10వేలు
మొత్తం సభ్యులు: 1.05లక్షలు

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తాం. స్వయం సహాయక సభ్యుల ద్వారా బడి నిర్వహణ చేపట్టేలా చూస్తాం. ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. కొత్త కమిటీలో స్వయం సహాయక సంఘాల గ్రామ కమిటీ అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా, ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

– ప్రణీత, డీఈవో

'ఉమ్మడి ఆదిలాబాద్'ను అగ్రగామిగా నిలపాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, చిత్రంలో ఎమ్మెల్యే బొజ్జు, నాలుగు జిల్లాల కలెక్టర్లు

- ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నాలుగు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత పెడదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వయం ఉపాధి, తదితర రంగాల్లో రాణించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, డీడబ్ల్యూవో శాఖల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా పచ్చదనంతో కళకళలాడాలన్నారు. నాలుగు జిల్లాల ఉన్నతాధికారులు సమష్టిగా పనిచేస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ ఆశిశ్ సాంగ్వాన్, మంచిర్యాల కలెక్టర్ సంతోష్, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దొత్రే, నాలుగు జిల్లాల ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక, ప్రజా సంక్షేమం, ఆరు గ్యారంటీల అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం పాటుపడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష అనంతరం ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ పార్టీకి ముందు నుంచే ప్రత్యేక అభిమానం ఉందన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, సీఎం తొలి పర్యటన సైతం ఇక్కడి నుంచే ప్రారంభమైందన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు నిధులు సైతం కేటాయించారన్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతుకు నిధులు కేటాయించి పనులు కూడా ప్రారంభించినట్లు చెప్పారు. ఇది వరకే ఉమ్మడి జిల్లాకు రూ.150 కోట్ల వరకు ఎస్ఆర్‌ఈజీఎస్ నిధులు విడుదల చేసి పనులను పూర్తి చేశామన్నారు. అలాగే సీఎం అభివృద్ధి నిధుల కింద నియోజకవర్గానికి రూ.10కోట్ల వరకు కేటాయించి తాగునీరు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లు గడిచిన పదేళ్లలో ఈ ప్రాంతానికి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. ఇరు పార్టీల దాగుడుమూతల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ, నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు.

'పీపుల్స్ మార్చ్'కు ఏడాది



గతేడాది మార్చి 16న పాదయాత్ర ప్రారంభిస్తున్న అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, నాయకులు వీహెచ్, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు

- ఉమ్మడి జిల్లా నుంచే 'భట్టి' పాదయాత్ర
- నాడు సీఎల్పీ నేత.. నేడు డిప్యూటీ సీఎంగా పిప్రికి రాక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 'హాథ్ సే హాథ్ జోడో'లో భాగంగా చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు నేటికి ఏడాది పూర్తయింది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు అప్పటి సీఎల్పీ నేతగా ఉన్న భట్టి మార్చి 16 నుంచి జూలై 2వరకు పాదయాత్ర చేశారు. మొదటగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బోథ్ నియోజకవర్గం పిప్రి నుంచి ప్రారంభించి ఖమ్మం నగరంలో ముగించారు. మొత్తం 109రోజులపాటు 1364కిలోమీటర్లు 36 నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కీలకంగా మారిన ఈ పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభమైంది. ఎండకాలంలో సాగిన ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. పాదయాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఉమ్మడి జిల్లాలో బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల మీదుగా ఆయన పాదయాత్ర సాగింది. గిరిజన, ప్రాంతాలతోపాటు మైదాన, సింగరేణి సమస్యలపై పలు హామీలు ఇచ్చారు. కార్నర్ మీటింగ్‌లతో స్థానికులతో మమేకమయ్యారు. ప్రస్తుత మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నీ తానై వ్యవహరించి భట్టి పాదయాత్రను విజయవంతం చేశారు. భట్టి పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని పలువురు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఆయనకు మద్దతు తెలుపుతూ యాత్రలో పాల్గొన్నారు.

అదే రోజు గుర్తుగా..

బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేయగా, తాజాగా అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో 'భట్టి' శనివారం వస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

డిప్యూటీ సీఎం సభకు ఏర్పాట్లు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలాం

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామంలో శనివారం నిర్వహించనున్న ప్రజాపాలన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఖుష్బుగుప్తా, డీఆర్డీవో సాయన్న శుక్రవారం పరిశీలించారు. డిప్యూటీ సీఎం విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి ఉదయం 10.30 గంటలకు పిప్రి గ్రామానికి చేరుకుంటారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, వారితో ముఖాముఖి నిర్వహిస్తారు. బోథ్ నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వారి వెంట జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావ్, డీఆర్‌పీ గంగన్న, సీఐ రమేశ్, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జెడ్పీటీసీ నర్సయ్య, చంటి, లింగారెడ్డి, పాండురంగ్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో..?

- కొనసాగుతున్న ఉత్కంఠ
- ఆదివాసీనే బరిలోకి దించాలని పార్టీ నిర్ణయం
- బొజ్జుతో పోటీ చేయించాలని అధిష్టానం యోచన
- రేవంత్‌తో 'సోయం' అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయిందనే ప్రచారం

సాక్షి,ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికలకు గాను కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతుంది. పలువురి పేర్లు వినబడుతున్నప్పటికీ పార్టీ ఇంకా ఒక నిర్ణయానికి రాలేదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆదివాసీ నేతనే బరిలోకి దించాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే ఈ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు నిరాశ తప్పదని అంటున్నారు. కాగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును రంగంలోకి దించాలని అధిష్టానం ఆసక్తితో ఉన్నట్టుగా కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతుంది. అయితే గడిచిన అసెంబ్లీ ఎన్నికలతోనే ప్రత్యక్ష రాజకీయాలకు వచ్చిన ఆయన ఇప్పుడే పార్లమెంట్‌కు పోటీ చేసే విషయంలో ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఒకవేళ ఆయన పోటీకి ముందుకు రాకపోతే ఆశావహుల్లో ఎవరికైనా టికెట్ లభించవచ్చనే చర్చ సాగుతోంది.



ఆశావహుల ముమ్మర యత్నాలు..

కాంగ్రెస్ టికెట్ కోసం 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఎల్ఐసీ ఉద్యోగానికి ఇటీవలే రాజీనామా చేసి పార్టీలో చేరిన కోవ దౌలత్‌రావు మొకాశి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉన్న మర్సుకోల సరస్వతి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారు. అప్పట్లో కాంగ్రెస్ నుంచి ఆసిఫాబాద్ టికెట్‌ను ఆశించిన ఆమె దక్కకపోవడంతో పార్టీ వీడారు. తాజాగా ఆమె పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ర్యాండమ్ సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా ఆదివాసీలకే టికెట్ ఇవ్వాలని మెజార్టీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పార్టీ ఆదివాసీ అభ్యర్థికే మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం ఉంది. ఇదిలా ఉంటే నియోజకవర్గాల ఇన్‌చార్జీల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేయగా ఆశావహుల్లోని ఓ అధికారి పేరు ఎక్కువ మంది చెప్పినట్లు తెలుస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ విషయంలో సమాలోచన చేస్తున్నట్లు సమాచారం.

అపాయింట్‌మెంట్ ఫిక్స్ అనే ప్రచారం..

బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ ఎంపీ సోయం బాపూరావు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం ఇప్పటికీ కొనసాగుతుంది. ఇదిలా ఉంటే శనివారం సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయ్యిందనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదనేది స్పష్టమవుతోంది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. మరోపక్క ఎన్నికల నోటిఫికేషన్ నేడు రానుంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యర్థి ఎంపికను త్వరగా ముగించాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి.

మోదీ పాలన చూసే బీజేపీలో చేరా..

- పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

కైలాస్‌నగర్: గత పదేళ్లలో అవినీతి రహిత పాలనను అందిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థను అగ్రరాజ్యాలకు దీటుగా తీసుకెళ్లిన ప్రధాని మోదీకి నేనేందుకు మద్దతివ్వకూడదనే ఉద్దేశంతోనే బీజేపీలో చేరానని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాక తొలి సారి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు బీజేపీ శ్రేణులు మావల బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికారు. మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యకర్తల గౌరవాన్ని కాపాడుతూ, పార్టీ ప్రతిష్టతను పెంచేలా పనిచేస్తాన్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా చేయడమే లక్ష్యంగా కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీయే ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, నాయకులు అమర్‌సింగ్ తిలావత్, అశోక్ ముస్తాపురే, నగేష్, విజయ్, జ్యోతిరెడ్డి, కృష్ణయాదవ్, వేదవ్యాస్, ధోని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

ముఖ్యనేతల గైర్హాజరు

సమావేశానికి పార్టీ ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, రామారావు పటేల్‌తో పాటు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులెవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థిత్వం ఖరారయ్యాక నిర్వహించిన తొలి సమావేశానికి ముఖ్య నేతలు డుమ్మకొట్టడంపై రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయం హుండీని కొద్ది దూరం ఎత్తుకెళ్లి తాళం పగలగొట్టి అందులోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు గమనించి హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం సిబ్బంది అక్కడికి చేరుకొని ఫింగర్ ప్రింట్స్ సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

విచారణ ప్రారంభం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ జాదవ్ విజయ్ కుమార్ రైతుల డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకున్న ఘటన నేపథ్యంలో శుక్రవారం విచారణ అధికారి భాస్కర్ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విచారణ విషయాన్ని తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని, డబ్బులు రికవరీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులందరికీ తగిన న్యాయం చేస్తామని విచారణ అధికారి హామీ ఇచ్చారు. డబ్బులను ఖాతాల్లోకి మళ్లించుకున్న సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం రైతులు పెద్ద ఎత్తున వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ తరలివెళ్లి విచారణ అధికారితో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణకు విషయాన్ని వివరించారు. అయితే సీఐ మాట్లాడుతూ రైతుల డబ్బుల మళ్లింపు విషయాన్ని తెలియజేసినప్పటికీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదన్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

ఇద్దరి అదృశ్యం

ఎదులాపురం: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. మహారాష్ట్రకు చెందిన మాండ్వీ తాలుకా ఝరిలో జామిని గ్రామానికి చెందిన 38 ఏళ్ల దూదల్‌కర్ గజానన్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనికి వెళ్తున్నానని ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య మమత శుక్రవారం టుటౌన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ..

పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన 36 ఏళ్ల వివాహిత ఈ నెల 13న మధ్యాహ్నం ఒంటి గంటకు పుట్టింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన సదరు మహిళ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఐదు నెలల కిందట మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై హరితవనం పార్క్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన విశ్వనాథ్ (46) గురువారం రాత్రి మృతి చెందాడు. కారు ప్రమాదంలో గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపాడు.

ఆర్థిక చేయూత అందేనా..?


సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నేతలు (ఫైల్)

- 16 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా కులాలు

ఆదిలాబాద్‌రూరల్: గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఆయా శాఖల ద్వారా సబ్సిడీపై బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను అందజేసేది. గత ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధి కోసం దళిత బంధు లాంటి పథకాలను ప్రవేశపెట్టి రుణాలు అందజేసింది. అర్హులైన వారందరికీ రుణాలు అందడం లేదని ఎస్సీ సంఘాల నాయకులు ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. అలాగే 2016 కంటే ముందు బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు సబ్సిడీపై రుణాలు అందజేసింది. తర్వాత ఆ కార్పొరేషన్‌ను బీసీ అభివృద్ధి శాఖలో విలీనం చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం బీసీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదని, ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీలలోని పలు కులాలకు చెందిన వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎస్టీల కోసం ఐటీడీఏ ద్వారా రుణాలను అందజేస్తున్నారు. ఆయా ఆర్థిక సంవత్సరంలో చాలా మంది అర్హులైన వారికి రుణాలను అందడం లేదు. ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని గిరిజన సంఘాల నాయకులు గతంలో డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్థికంగా వెనుకబడిన కులాలను అభివృద్ధి చేయాలని ఆలోచించిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కేబినెట్ మంగళవారం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా కార్పొరేషన్‌లకు ప్రత్యేకంగా నిధులు మంజూరు కానున్నాయి. వాటి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందని పలు సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

నూతనంగా ఏర్పాటు కానున్న కార్పొరేషన్లు..

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం 16 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో యాదవ, కుర్మ, మున్నూరుకాపు, పద్మశాలి, పెరిక (పురగిరి క్షత్రియ), లింగాయత్, బలిజ, గంగపుత్ర, మేరు, ముదిరాజ్, ఆర్య వైశ్య, రెడ్డి, మాదిగ, మాదిగ ఉపకులాల, కుమురంభీం ఆదివాసీ, సంత్ సేవాలాల్ లంబాడా, ఎరుకల ఇతర ఉప కులాల కోసం ఏకలావ్య కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్లు కేటాయించిన అందులో ఏ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాలేదని వివిధ సంఘాల నేతలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లకు సకాలంలో నిధులు కేటాయించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఆయా సంఘాల నేతలు కోరుతున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌లకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆయా శాఖలకు అంతంత మాత్రంగానే ప్రభుత్వం నిధులు కేటాయించడంతో తాము రుణాలు పొందలేకపోతున్నామంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించి తమ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

సంతోషకరం



కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల కిందట గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం సంతోషకరంగా ఉంది. ప్రభుత్వం కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తే ఆర్థికంగా వెనుకబడి ఉన్న గంగపుత్రులు రుణం తీసుకొని అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

– మ్యాకల అశోక్, గంగపుత్ర సంఘం జిల్లా నేత

నిధులు కేటాయించాలి



గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆయా ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించి నిరుద్యోగులను రుణాలను అందజేసి అండగా నిలిచేవారు. కొన్నేళ్ల నుంచి అలాంటి రుణాలు అందడం లేదు. గత ప్రభుత్వం దళిత బంధు పథకం ప్రవేశపెట్టిన్నప్పటికీ అందరికీ రుణాలు అందలేదు. కార్పొరేషన్‌కు సకాలంలో నిధులు కేటాయిస్తే అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

– మల్యాల మనోజ్, మాదిగ సంఘం జిల్లా నేత

అవినీతిపరులను పార్టీలో చేర్చుకోవద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి

నిర్మల్‌ఖిల్లాగేట్: అవినీతిపరులను పార్టీలో చేర్చుకోవద్దని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీలు మార్చేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్లు మంత్రిగా ఉండి అధికార దాహంతో అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ మంత్రి, అతడి కుటుంబీకులు అక్రమించుకున్న చెరువులు, కందకాలు డీ1 పట్టాలను కాపాడుకోడానికి కాంగ్రెస్‌లోకి వచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నాయకుడిని పార్టీలో చేర్చుకోవద్దంటూ సీఎంకి విన్నవించాలని కోరారు. కబ్జామంత్రి పార్టీలోకి వస్తే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత..

అనంతరం ఉట్నూరు కేబీ కాంప్లెక్స్‌లో నిర్మల్ నియోజకవర్గ నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దంటూ వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రి సీతక్కకు వినతి

ఖానాపూర్: అంగన్‌వాడీ టీచర్లకు వేసవిలో ఒక పూట సెలవులు మంజూరు చేయాలని టీఎన్జీవో అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ కోరారు. ఈమేరకు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్‌కు వచ్చిన మంత్రిని ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు కలిసి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సంబంధిత శాఖ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. తర్వాత వేసవిలో ఒంటిపూట సెలవులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వంగ వరలక్ష్మి, నాయకులు ఆర్.విజయలక్ష్మి, లీలారాణి, కవిత, మంగమ్మ, రాజేశ్వరి, భాగ్యరేఖ తదితరులు ఉన్నారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే

నిర్మల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాగులపేట కార్యకర్తలతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయనను ఆలయ సిబ్బంది సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఉన్నారు.


కార్యకర్తలతో ఆలయం ఎదుట ఎమ్మెల్యే సంజయ్

ఎలక్ట్రీషియన్‌పై హత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గొడిసెల్లి సోముపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం ... ఉట్నూర్ మండలం లక్కారంలో నివాసముంటున్న సోము శుక్రవారం లక్కారం గ్రామపంచాయతీ సమీపంలోకి వెళ్లగా ఓ గుర్తు తెలియని యువకుడు సోముపై కత్తితో దాడి చేయగా మేడ, కడుపులో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో నిందితుడు కత్తిని వదిలి పారిపోయాడు. స్థానికులు గాయాలపాలైన సోమును ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. సోము సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అ‘పూర్వం’.. 50 ఏళ్ల ఆత్మీయం

- ఘనంగా 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- వేదికైన తలమడుగు జిల్లా పరిషత్ పాఠశాల



నాడు కొండలు, వాగులు దాటి కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి చదువుకున్న బాల్యమిత్రులు వారంతా.. నూనుగు మీసాల వయసులో పదో తరగతి పూర్తి చేసిన క్లాస్‌మేట్స్.. అనంతరం ఎక్కడెక్కడే స్థిరపడ్డారు.. కట్ చేస్తే.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు కలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. ఇందుకు చదువులమ్మ ఒడి వేదికైంది. వారే తలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. తెల్ల జుట్టు.. మారిన ముఖాలు.. ఒకరినొకరు గుర్తు పట్టుకోలేని వారంతా శుక్రవారం మళ్లీ నాడు చదువుకున్న పాఠశాలకు చేరుకున్నారు. అడుగు పెడుతూనే నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆత్మీయ ఆలింగనాల అనంతరం పరిచయ కార్యక్రమం చేపట్టారు. పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఇక్కడే చదివి ఈ బడిలోనే హెచ్‌ఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన ఎల్‌టీ కృష్ణారెడ్డి మాట్లాడారు. విద్యార్థుల తలరాతలు మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. ఇష్టపడి చదివితే ఉన్నతంగా రాణించవచ్చన్నారు. పాఠశాలలో నాడు 45 మంది విద్యార్థులు ఉండగా.. అందులో చాలా వరకు చనిపోయారు. మిగిలిన వారిలో 15 మంది వరకు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వీరిని పాఠశాల ప్రస్తుత ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రస్తుత పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం కొనసాగింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాటిపల్లి అశోక్‌రెడ్డి. మంతెన దశరథ్, లక్ష్మారెడ్డి, అమృత్‌రావు, ప్రకాశ్‌రెడ్డి, ప్రస్తుత హెచ్‌ఎం వెంకటరావ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– తలమడుగు


చేతిపంపు వద్ద స్థానికులు

భగీరథ రాక.. జనాల వ్యథ

ప్రతి ఇంటికి శుద్ధజలాన్ని అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా బేల మండలం అవల్‌పూర్ గ్రామంలో సగం ప్రాంతానికే పరిమితమైంది. మరో సగం గ్రామానికి చుక్క నీరు రావడం లేదు. దీనికి తోడు బోరుబావుల్లోనూ నీరు అడుగంటిపోయింది. దీంతో చేతి పంపే వారికి పెద్ద దిక్కుగా మారింది. 500మంది జనాభా ఒకే ఒక చేతి పంపుపై ఆధారపడాల్సి వస్తోంది. నీటి కోసం జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడం గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


అలంకారప్రాయంగా మిషన్ భగీరథ కుళాయి


అడుగంటిపోయిన బోరుబావి

టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

- మృత్యువుతో పోరాడుతున్న రాకేశ్
- అధికారులు వేధింపులే కారణమని కుటుంబీకుల ఆరోపణ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేశ్

జన్నారం: తన కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేయగా, మానసికంగా కుంగిపోయిన నీటిపారుదల శాఖ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం చేసి మృత్యువుతో పోరాడుతున్నాడు. బాధితుడి తల్లి తోకల సరస్వతి, తమ్ముడు విషేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం గ్రామపంచాయతీకి చెందిన తోకల రాకేశ్ కడెం నీటి పారుదలశాఖ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా రాకేశ్‌ను ఇదే కార్యాలయంలోని సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తున్నారు. గతంలో ఇలాగే వేధింపులకు పాల్పడగా, రాకేశ్ తండ్రి వారికి ఫోన్ చేసి బెదిరించాడు. మూడు నెలల క్రితం రాకేశ్ తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. అప్పుడు రాకేశ్ 15రోజులు సెలవు తీసుకున్నాడు. తిరిగి విధుల్లో చేరిన రాకేశ్‌ను కొంతకాలంగా మళ్లీ వేధిస్తున్నారు. ఈ విషయం రాకేశ్ ఇంట్లో చెప్పాడు. తన తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగగా సదరు అధికారులు వేధింపులకు గురి చేశారు. ఈ వేధింపులు భరించలేక రాకేశ్ గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రాకేశ్ తల్లి సరస్వతి తెలిపింది. తన కుమారుడిని వేధింపులకు గురిచేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా, ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ బోజదాస్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా, రాకేశ్‌ను కార్యాలయంలో ఎవరూ వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. గురువారం విధులకు హాజరై వెళ్లాడని, అతడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను కూడా ‘సాక్షి’ వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కరెంట్ బిల్లు షాక్


బిల్ చూపుతున్న వినియోగదారురాలు

లక్ష్మణచాంద: మండలంలోని కొట్టూరు రాములు ఇంటికి నెల విద్యుత్ బిల్లు రూ.5,565 వచ్చింది. దీంతో ఆ బిల్లు చూసిన రాములు ఇద్దరమూ ఉండే ఇల్లుకు ఇంత బిల్లు రావడం ఏమిటని వాపోతున్నాడు. గతంలో నెల నెల రూ.120–150 బిల్లు వచ్చేదని, ఇప్పుడు రూ.5,565 బిల్ ఎలా వచ్చిందని ఆయన వాపోతున్నారు. దీనిపై సాక్షి ఫోన్‌లో మండల విద్యుత్ ఏఈ మహేశ్‌ను సంప్రదించగా గతంలో మీటర్‌కు అనుమతి తీసుకునే సమయంలో తక్కువ వాట్స్‌కు అనుమతి తీసుకుని ఎక్కువ వాట్స్ వినియోగించడంతో తనిఖీ చేసిన అధికారులు చూసి అప్పుడు ఫైన్ వేసి ఉంటారని, కాని వారు వినియోగదారుడు చెల్లించకపోవడంతో ఇప్పుడు అదే బిల్లులో కలిపి వచ్చి ఉంటుందని ఆయన తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- నిమిషాల వ్యవధిలో రెండు ప్రమాదాలు, నలుగురికి తీవ్రగాయాలు
- ఒకే కారు ఢీకొని ఉంటుందని గాలిస్తున్న పోలీసులు


నవీన్ మృతదేహం

గుడిహత్నూర్: మండలంలో నిమిషాల వ్యవధిలో జరిగిన ఇరు రోడ్డు ప్రమాదాల్లో ఓ యువకుడు మృతిచెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలం మాడగూడ, మోర్కండి గ్రామాలకు చెందిన తొడసం బాలాజీ, నవీన్, మేస్రం భీంరావ్‌లు బైక్‌పై ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో సంఘటనా స్థలంలో నవీన్ (22) మృతిచెందగా మిగితా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలో సీతాగోంది సమీపంలో మరో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న మహారాష్ట్ర సమీపంలోని గోసాయి ఉండం గ్రామానికి చెందిన బడేవాడ్ శ్రీనివాస్, అమృత్‌రావ్‌లను సైతం కారు వెనుక నుంచి ఢీకొనగా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వీరిని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. కాగా నిమిషాల వ్యవధిలో కారు ఢీకొనడంతో ఒకే కారు వీరిని ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదాలకు కారణమైన కారును పట్టుకోవడానికి ఆయా రూట్లలో ఉన్న పోలీసులకు సమాచారం అందించి గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

ఉక్కపోత... రోగుల అవస్థ


వెయిటింగ్ హాల్‌లో పనిచేయని ఫ్యాన్‌లు


ఇంటి నుంచి తెచ్చుకున్న ఫ్యాన్

ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. దీనికి తోడు ఉక్కపోత తీవ్రంగా మారింది. దీంతో రిమ్స్ ఆస్పత్రిలోని పలు వార్డుల్లో ఫ్యాన్లు లేకపోగా.. ఉన్న ఫ్యాన్లు పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతను భరించలేక రోగులు ఇంటి వద్ద నుంచి టేబుల్ ఫ్యాన్లను వెంట తెచ్చుకుని ఉపశమనం పొందుతుండటం రిమ్స్ దుస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్